## ఇష్టపదులు

చలించే పాదరసమైనా
ఎప్పుడోవకప్పుడు
కుదురుంటుందేమో గాని
బ్రతుకులోని ధరలు మాత్రం
ఎప్పుడు కుదురుండవు.

ఆ పిచ్చుక రోజూ
మా ఇంట్లోకొచ్చి అద్దం మీద
ముక్కుతో పొడిచి
అందం చూసుకోకపోతే
ఏదైనా బ్యూటీ పార్లర్
కెళ్ళొచ్చుగా.

రక్తం చవి చూసిన రోడ్లు
రోజూ పెట్టమంటాయి
యాక్సిడెంట్లు భోజనం.



– భూషి కృష్ణదాసు
సెల్:9618069338

## వెతల వేళల..

తన ఉనికి చాటుకుంటూ హొయలు పోవటం
కదిలే వేళ పెళ పెళ సవ్వడులు వినిపించటం
సొంతమైన డాబు దర్పాలు ఒలకబోయటం
బాగానేర్చిన పట్టు చీర లేని వేడుకే ఉండదుగా.

పట్టుమని పదిసార్లయినా కట్టుకోని
పట్టుచీర పెట్టెలోనే భద్రపరుచుకుంటూ
జలతారు పైట అంచు మాసిపోకుండా
ఎప్పుడూ నిగనిగలాడేలా చూసుకుంటాను

చుట్టుకున్నా కట్టుకున్నా చీరసింగారమే
పట్టుజారనీకుండా వేళ్ళకాపు పెడుతుంటాను
మళ్ళీ ఏదో పండగో,పేరంటమో వచ్చేవరకూ
సున్నితంగా మడత పెట్టి పెట్టెలో దాస్తాను

మనసు సందడి వేళల్లోనూ కొన్ని భావాలు
పట్టుచీరల జిలుగులా వగలుపోతుంటాయి
తలపుల తడికెల్లోంచి జారిపోకుండా
పెట్టెలో పట్టుచీరలా భద్రపరుచుకుంటా

వెతల వేళల వేడుకల పిలుపులందుకొని
పెట్టెతెరచి చూసుకు మురిసిపోతుంటా



– డాక్టర్ చక్రపాణి యిమ్మిడిశెట్టి
9849331554

## గరిక బుడ్డి (కథ)

కోసల రాజ్యాన్ని పాలించే విజయవర్మ ఆయన భార్య అంతపురంలో ఉన్నారు. రాత్రి అయినందున నిద్రించటానికి పట్టే మంచం మీదకు చేరుకున్నారు. ఆ పట్టే మంచం అంచున బారుగా చీమలు బార్లు దేరి వెళుతున్నాయి. కొని ఆవైపు నుంచి వస్తుండగా మరికొన్ని ఈ వైపు నుంచి వెళుతూ మూతి రాసుకుంటూ వెళుతున్నాయి. ఆ చీమల బారులను చూస్తూ ఉన్నాడు రాజుగారు. ఇతనికి పశుపక్ష్యాదుల బాష తెలుసు. అందుకే అవి ఎటంత హడావుడిగా తిరుగుతున్నాయి. ఏం మాట్లాడుకుంటున్నాయి అని వాటి వైపు తిరిగి పడుకున్నాడు. మంచం పట్టి కాళ్ళవైపు నుంచి వచ్చే చీమలు ఆడపెళ్ళివాళ్ళని మంచం హలవైపు వచ్చే చీమలు మగపెళ్లి వాళ్ళని తెలిసింది. పెళ్లి కార్యక్రమాల నిర్వహణకు గానూ అవి అంతా క్రమ బద్ధంగా హడావుడిగా పరుగు పరుగున తిరుగుతున్నాయనీ అర్థమయింది. రాజు పెదవుల మీద చిన్న నవ్వుల మొలక విరిసింది. అంతలోనే వల్ల మధ్య పెద్ద గొడవ మొదలయింది.

ఎంటా గొడవ అనుకోని మరలా పరికించి చూశాడు. ఆడపెళ్ళి బృందంలోని ఓ ముత్తైదువ పెళ్ళికి కావాల్సిన గరిక బుడ్డిని మోసుకెళుతూ ఉందిట. ఆ గరిక బుడ్డి పెళ్ళికి ప్రధాన వస్తువు కాబట్టి చాలా జాగ్రత్తగా తీసుకురావాలని చెప్పారు. అలాగే ఆ ముత్తైదువ కూడా ఎంతో జాగ్రత్తగా దానిని తీసుకువస్తూ ఉంది. కానీ మంచం చివరకు వచ్చే సరికి మంచానికి ఉన్న కోడుతగిలి ఆ గరిక బుడ్డి పగిలి పోయింది. దాంతో వాళ్ళందరికీ కోపం వచ్చి తలా ఒక దెబ్బ వేశారు. ఆ ముత్తైదువును. ఆమె చాలా బాధపడుతూ నేను చాలా జాగ్రత్తగానే తెస్తున్నాను. అకస్మాత్తుగా ఈ కోడు తగిలి కిందపడి పగిలిపోయింది. నేనేమీ తప్పుచేయలేదు. అంటూ చెప్పింది. వాళ్ళందరూ చాలా కోపంగా ఉన్నారు. నువ్వేలా పడేసిన ఇప్పుడైతే పెళ్లి ఆగిపోయింది కదా! గరిక బుడ్డి మనకెంత ప్రాముఖ్యం కలిగిన వస్తువో నీకు తెలుసు కదా! అది లేకుండా పెళ్లి జరుగదు అని కూడా తెలుసు. అయినా ఇప్పుడది పగిలిపోయింది. ఇప్పుడు పెళ్లి ఆగిపోతే మన పరువెం గానూ ఇలా తలా ఒక మాట అంటున్నారు. ఆమె ఏడుస్తూ నేను కావాలని దాన్ని పగులగొట్టలేదు. పొరపాటున మంచం కోడు తగిలి పడిపోయింది. అని చెప్పిందే చెప్తున్నది. ఈ వైనమంతా వింటున్న రాజు గారికి నవ్వు వచ్చింది. ఈ చీమలక్కూడా ఇన్ని సంప్రదాయాలా అని ఫకాలున నవ్వాడు.ప్రక్కనున్న రాణిగారు ఇటు తిరిగి 'ఏమైంది మహారాజా నవ్వుతున్నారు' అంది. ఏదో విషయం ఉంది అనుకుని మళ్ళీ 'ఏంటి మహారాజా నవ్వుతున్నారు' అని అడిగింది. నాకు పశుపక్ష్యాదులు మాట్లాడుకునే భాషను ఒక మునివర్యుడు ప్రసాదించాడు. అందువళ్ళు ఇక్కడున్న చీమలు ఏం మాట్లాడుకుంటున్నాయో వినడం వల్ల నాకు నవ్వు వచ్చింది. అని అన్నాడు రాజు.

ఏమిటీ విచిత్రమైన విషయాలు చెపుతున్నారు. మీకు చీమల బాష తెలుసా! అయితే అవి ఏం మాట్లాడుకున్నాయో అంతా మీకు నవ్వు వచ్చేలా అన్నది రాణి. అప్పుడు రాజు ఇలా అన్నాడు. ఆ విషయాల గురించి ఎవరికి చెప్పకూడదు. అని ఆ మునివర్యుడు ఆదేశించాడు. ఎవరికైనా ఈ విషయం చెప్పినట్లుయితే నా తల వేయి ముక్కలై చచ్చిపోతాను అని ఆ మునివర్యుడు శాపమిచ్చాడు. అందువలన ఇది ఎవరికి చెప్పలేను. ఆ విషయం అడగకు అని శాంతంగా వివరించాడు రాజు.

రాణికి మరింత పట్టుదల పెరిగింది. చాలా అబద్దాలు చెబుతున్నారు రాజా! మీరు చచ్చిపోయినా సరే నాకు నిజం తెలియాలి అన్నది కచ్చితంగా.

రాజు నిర్ఘాంతపోయాడు ఎంత చెప్పిన ఎన్ని విధాలా ప్రయత్నించినా ఆమె మొండి పట్టు విడువ లేదు. చివరకు రాజుకు విసుగు పుట్టి సరే నేను చచ్చిపోతే చచ్చిపోతాను కానీ నీ బాధ పడలేను. నీకు చెమలు ఏం మాట్లాడుకున్నాయో చెప్పేస్తాను కానీ ఒక్క షరతు. నేను ప్రజలందరి మధ్యలో ఈ విషయం చెప్పి చనిపోతాను. నేను ఎందుకు చనిపోయనో అందరికీ కారణం తెలియాలి. భార్య వేధింపుల వలనే రాజుకు మరణం సంభవించిందని తెలియాలి అన్నాడు.

ఆమె చెపుతాను అన్నమాటే పట్టించుకుంది. కానీ మిగితావేవీ ఆమె వినిపించుకోలేదు. ఆ విషయమేంటో తెలుసు కోవాలన్న ఉత్సాహంతో ఉండేగానీ తన భర్త చనిపోతున్నాడనే జ్ఞానం కూడా లేకుండా పిచ్చిపట్టిన దానిల ఆనందించసాగింది. రాజు ఊరంతా ప్రకటన చేయించాడు. రాజు మందిరం ఎదురుగా పాడెను ఏర్పాటు చేశారు. జనమంతా నిలబడటానికి పందిళ్ళు వేయించారు. ఊరంతా కోలాహలంగా ఉంది.

రాజ్యంలో ప్రజలంతా వింతగా మాట్లాడుకోసాగారు. ఏమిటి వింత! రాజు గారు చనిపోవటమేమిటి. చనిపోయే ముందు అతను చెప్పబోయే విషయం ఏమై ఉంటుంది. అది చెప్పగానే ఆయన తల పగిలి చనిపోవటమేమిటి. రాణి గారు ఈ విషయం పై పట్టుబట్టటమేమిటి? అన్నీ సమాధానం దొరకని ప్రశ్నలే. ఎవరికి ఏమి అర్థంకాలేదు. అందరూ పనులు మానేసి రాజు గారి కోట దగ్గరే వేచి చూస్తున్నారు.

అంతలోనే రాజుగారు బయటకు వచ్చారు. ఆయనకై ఏర్పాటు చేయబడిన పాడే మీద పడుకున్నారు. ఇదిగో ప్రజాలారా అందరూ వినండి నేను చెప్పేబోయే విషయం ఏంటంటే అని ఆయన మాట్లాడుతూ ఉండగానే ఎక్కడి నుంచో రెండు చిలకలు ఒక దాని నొకటి ముక్కుతో పొడుచుకుంటూ కీచులాడుకుంటూ వచ్చి రౌగారు పడుకున్న పందిరి మీద వాలాయి. అవి బాగా దెబ్బలడుకుంటున్నాయి. రాజుగారు ఆశ్చర్యంగా వాటి వంక చూశాడు. అపుడు ఆ రెండు చిలుకలు ఇలా మాట్లాడుకుంటున్నాయి.

ఇందాక నువ్వెందుకు నవ్వావో చెప్పు అంతున్నది ఆడచిలుక. ఆ విషయం చెబితే నేను చచ్చిపోతాను. అని చెబితే వినవే అన్నది మగ చిలుక. నువ్వు చచ్చినా పర్లేదు. నాకు మాత్రం విషయం తెలియాల్సిందే. అన్నది ఆడ చిలుక. ఏంటి నేను చచ్చిపోయినా ఫరవాలేదా అంటే నీకు నా మీద ప్రేమ లేదా! నేను లేకపోయిన నువ్వు హాయిగా బతికే ఉంటావా! అని ఆశ్చర్యంగా అడిగింది మగ చిలుక.

అవును బతికే ఉంటాను. నువ్వేమైన నాకు తెలీదు. నాకు మాత్రం విషయమెంతో తెలియాలి పంతంగా అన్నది ఆడ చిలుక. మగ చిలుకకు పౌరుషం వచ్చింది. ఏంటి భార్య మూర్ఖత్వానికి తలొగ్గి చచ్చిపోవడానికి సిద్ధపడి ఆ పడే మీద పడుకున్న రాజు ననుకున్నవా నన్ను. నేను చచ్చిపోతానని చెప్పినా పంతం వదలక నా వెంట పడుతున్నావు.చచ్చిన పరవాలేదు అన్నావు. నీ మాటకు విలువివ్వాల్సిన అవసరమే లేదు. అసలు నా క్షేమం కోరని నువ్వు నాకు వద్దే వద్దు. నీకు నా మీద ప్రేమే లేదు. నిన్ని నేను వదిలేసి వెళుతున్నా. నీ చావు నువ్వు చావు అని మగ చిలుక ఎగురుకుంటూ వెళ్లిపోయింది ఆడ చిలుకను వదిలి.

ఇదంతా విన్న రాజుగారికి జ్ఞానోదయమయింది.

ఆ చిలుకాకున్నా చిన్నపాటి జ్ఞానం నాకు లేకపోయిందే! నా భార్య పంతానికి నేను ఎందుకు తలవంచాలి. విషయం బయటకు వస్తే చనిపోతానని చెప్పినా కూడా ఏ మాత్రం బాధ పడకుండా చెప్పు చెప్పు అని వేదిస్తోంది. నా మీద ప్రేమ లేని మనిషి మాట నేనెందుకు వినాలి. అనుకోని వెంటనే పాడే మీది నుంచి లేచాడు రాజు.

ఏమిటి చీమలు ఏం మాట్లాడుకున్నాయి అదేంటో చెప్పకుండా మళ్ళా పైకి లేచావేమిటి? అని ఆదుర్దాగా అడుగుతూ ముందుకు వచ్చింది రాణి. ఏంటి నీకు విషయం చెప్పాలా! నేను చెప్పనే చెప్పాను ఏం చేస్తావో చేసుకో అని కోపంగా అన్నాడు రాజు.

తర్వాత సైనికుల వైపు తిరిగి ఈమె సరిగా మాట్లాడుతూ మామూలుగా ఉంటే అంతపురానికి తీసుకురండి లేదా కారాగారంలో బంధించండి అని ఆజ్ఞాపించి కోటలోనికి వెళ్లిపోయాడు రాజు.

(మూర్ఖుల మాటలకు తలవంచి విలువైన జీవితాన్ని నాశనం చేసుకోగూడదు)



–డా॥కందేపి రాణీప్రసాద్
98661 60378

## ఈ రేయి మరిచి

బ్రతుకు తెరువు
బ్రతుకు ద్వీపం
జీవన గమనంలో నీ అడుగు నిన్ను శాసిస్తుంది
క్రమంగా నీ కన్నుల్లో
నీ కాంతి కలువల వెన్నెల కరిగి నిరసించిపోతుంది
బ్రతుకంతా నిరాశ గూటిలోకి చిక్కుకుంటుంది
ఇప్పటిదాకా ఆశల ఉదయం పై
అహర్నిశలు తపించావు
మనసు మనోహరమంతా
విషాద గాధలు చుట్టూ తిరుగుతుంది
పగలు రేయి శ్రమించిన
కడుపు నిండదు
నీలోని అత్యాశ నిన్ను చివరికి బలి చేస్తుంది
బ్రతుకు బహు కోణంలో
సాగిన చూపు
నిన్న లేని అందమేదో
నేడు చూపించాను అనుకుంటావు
కలువల్ల విరిసిన కన్నులు నేడు నల్లని మరకలతో
కనురెప్పలు విషాదపు దుఃఖ కన్నీళ్లను
విడుస్తూనే ఉంటాయి
ఆశల సమయం దాటి భాదల సమయం వచ్చి
మగువ మనసు విడిచి
మనుషులు నిన్ను పశువు కంటే
ఎక్కువగా హింసిస్తారు
నీ దేహవాంచకు రూపాయలతో
కొలుస్తూ దాహం తీర్చుకుంటారు
చివరికి దేహమంతా వ్యాధుల సుడిగుండమై
కానరాని విచార వదనం
కనిపించని వేదన గీతం
మనసంతా పశ్చాతాపం
పదేపదే భావిస్తూ వేధిస్తుంది
జ్ఞాపకాల సమయం.....



–డాక్టర్ సిహెచ్ ఆంజనేయులు
7702537453

పుస్తక సమీక్ష

# చైతన్య ధార "పొద్దుపొడుపు సూరీడు"

కలం పట్టిన ప్రారంభంలోనే ఆలోచింపజేసే కవిత్వం వ్రాస్తున్న కవి ఎని శెట్టి గంగా ప్రసాద్ గారు రాసిన పొద్దుపొడుపు సూర్యుడు కవిత్వ పుస్తకం ఎంతో ఆలోచింపజేస్తుంది కవిత్వం ఒక తీరని దాహం లా భావించి అనుక్షణం కవిత్వం కోసం పరితపిస్తున్న కవిగా ఈయన రాసిన పుస్తకాలు ఎంతో ఆలోచింప చేస్తున్నాయి

సమాజంలో కనిపించే అనేక సమస్యలకు స్పందిస్తూ ఈయన రాసిన కవిత్వం నేడు మేటి కవిత్వం గా నిలుస్తున్నది గతంలో ఈయన రాసిన ఆక్రందన మొర కరోనా పై కవితా శంఖారావం. సామాజిక పద్య సుమాలు. ఎందరినో ఆలోచింపజేసినాయి

భాషకు తోరణం భావకవుల సమ్మేళనం అని భావించే ఈయన పొద్దుపొడుపు సూర్యుడు అనే ఈ వచనా కవిత సంపుటిలో ప్రారంభంలో కొన్ని ఆలోచింపజేసే గేయాలను వ్రాశారు

ప్రతి గేయం కూడా సమాజంలో చూసిన అకృత్యాలకు చలించి రాసినదై ఉన్నది గంగా ప్రసాద్ గారు అనతి కాలంలోనే మంచి కవిత్వం రాసే కవిగా పేరు తెచ్చుకున్నారు వీరు రాసిన ఈ పుస్తకం అందరినీ ఆకట్టుకుంటూ ఆలోచింప చేస్తున్నది. ఈయన రాసిన ఈ పుస్తకంలో అనేక సమస్యలను కవిత్వంగా మలిచారు ఇంకెన్నాళ్లు అనే. శీర్షికన రాసిన ఈ వాక్యాలు చూడండి

**కత్తులు కటారులు లేవు**
**కరవాలపు చప్పుడులు లేవు**
**యుద్ధమేఘాలు కనిపించవు**
**అయినా యుద్ధం జరుగుతుంది.**

**కనబడని శత్రువు**
**చేస్తున్న మారణ హోమం**
**ఇంకెన్నాళ్లు**


అంటూ సమాజాన్ని ప్రశ్నిస్తున్నారు

**కలాల గళాలు** అనే కవితలో కలాల గళాలు జనస్వామ్యపు జ్ఞాననేత్రాలై సాగాలి శాంతికపోతల ఎగరాలి అంటారు

నిజమే కళల కర్తవ్యం ఏమిటో తెలియాల్సిన అవసరం చాలా ఉంది ఇది ద్రవించిన హృదయ స్పందన కోటి గొంతుకలు గొంతు ఎత్తి చేసిన ఆర్తనాదం. కవుల గర్జన భావాలు ఏరులై పొంగిపొర్లుతుంటే ఇలాంటి వాక్యాలు కవుల కలాల్లో సాగిపోతుంటాయి

కవిత్వం చైతన్య ధారా ప్రవంతి కవిత్వము కాలక్షేపానికి కాకుండా ప్రజల సమస్యలను పరిష్కరించే మార్గంగా ఉండాలన్నది ఈ కవి భావన అందుకే ఈయన ప్రతి కవితలో సమస్యలను ఆధారంగా చేసుకుని మంచి భావనలతో చమత్కార ధోరణితో ఆలోచింపజేసే రీతిలో కవితలను రాశారు.

ప్రతి సమస్యపై స్పందించడము ఈ పుస్తకంలో మనం చూడవచ్చు కరోనాకాలంలో రాసిన కవితలను కూడా ఈ పుస్తకంలో పొందుపరచడం జరిగింది లయబద్ధంగా పాడగలిగే మంచి పాటలను కూడా ఈ పుస్తకంలో కవి రాశారు. ఈ పుస్తకం నిండా కవితలు చైతన్య ధార ప్రవాహమై సాగుతుంటాయి. చదివిన చదువరులకు పాఠకులకు ఇనసొంపుగా అర్థమయ్యే రీతిలో సులభశైలిలో ఈ కవితలన్నీ ఉన్నాయి పుస్తక






శీర్షిక ఎంచుకున్నప్పుడే కవి ఈ పుస్తకంలో ఏమి చెప్పదలిచాడో అర్థమయిపోతుంది.

పొద్దుపొడుపు సూర్యుడు సూర్యుడు చైతన్యానికి ప్రతీక కవీ సూర్యుడు ఒకటే లోకాన్ని నిద్దుర లేపేది సూర్యుడు అయితే ఆ లోకాన్ని మరింత చైతన్యపరిచేది కవి కలం అందుకే కళాలు ఎప్పుడూ గొప్పవే ఈ పుస్తక ముఖచిత్రము ప్రముఖ గజల్ కవి చిత్రకారులు సూరారం శంకర్ గారు అందించారు ఈ పుస్తకంలో యువకులకు మార్గనిర్దేశం చేసే పదాలు ఉన్నాయి కవులకు స్ఫూర్తి నింపే వాక్యాలు ఉన్నాయి సమాజాన్ని మేల్కొల్పి సరైన బాటలో నడిపించే నీతి వాక్యాలు ఉన్నాయి విద్యార్థులకు సందేశాలున్నాయి చతికిలపడి నలిగిపోయే మనసులకు ఓదార్పు ఉంది లక్ష నిర్దేశ మార్గ సూచనలు ఉన్నాయి.

ఈ పుస్తకంలో కవి రాసిన కవితలు ఎంతో ఆకట్టుకుంటాయి అందరినీ అలరించే జయం జయహో మహిళ అనే గేయంలో

**కవుల కలమున నిలిచి నట్టి**
**కథానాయక మొల్లయే**
**రామ కావ్యం రాసి నిలిచెను**
**కవన వనమున మణిపూసలై**

**కాకతీయుల నాటి రుద్రమ**
**కదిలి వచ్చిన కనకదుర్గయే**
**ఝాన్సీ రాణి పోరు సల్పిన**
**భరత ఖండపు ఆణిముత్యం**
**వీరమాతలు వీర వనితలు**
**కోటి వెలుగుల కాంతితో**

అంటూ వీర వనితలను కీర్తిస్తూ రాసిన ఈ గేయం చిరకాలం నిలిచిపోతుంది.

కదిలినారు నేడు ఎందరో కదిలిరే మహిళా మనుల్ అన్నిరంగములాక్రమించి నిలిచినారభివృద్ధి పథమున అంటూ మహిళామూర్తులను కీర్తించారు

బాలల గురించి తెలియజేస్తూ ఊరడింపు గేయంలో

**అమ్మ నాన్నల ప్రేమ మూర్తులు**
**నేటి భారతికి త్యాగనిరతులు**
**అభివృద్ధికి మీరు పునాది రాళ్లు**
**ఆనందానికి వారధులు**

అంటూ చక్కటి బాలల కోసం గేయాన్ని అందించారు

ఇది అందరూ పాడుకోదగిన మంచి పాట

**ఉద్యమానికి ఊపిరి మాట**
**ఉద్యమానికి స్ఫూర్తి పాట**
**మాట పాటల కలయిక**
**ఉధృతంబై నిలుచుబాట**

అంటూ పాట గొప్పతనాన్ని అనుభూతులు గేయంలో చూపించారు. కవిగా ఈయన రాసిన భావాలను తలుచుకుంటూ రాసే వాళ్లకు సందేశం ఇస్తూ రాసిన దాంట్లో పట్టుండాలి రాయడమే ముఖ్యమైతే ఎవరైనా వ్రాయచ్చు ఎన్నైనా వ్రాయచ్చు వ్రాసిన దాంట్లో భావం ముఖ్యం అది ఒసగే సందేశం ముఖ్యం సమాజానికి ఉపయోగపడడం ముఖ్యం ఆత్మవలోకనం ముఖ్యం నిన్ను నీవు ప్రక్షాళన చేసుకోవడం ముఖ్యం అంటూ తన మాటలో సందేశం ఇస్తున్నారు

**నోట** అనే కవితలో

**నోటు గెలిస్తే నేత**
**నోటు ఓడితే నోట**
**నోట విజృంభిస్తే నోటు భయపడుతుంది**

నోటుకు బెదిరితే నోట సమాధి అవుతుంది

నేటి ఓటు ప్రక్రియ. ప్రజాస్వామ్యంలో ఎలా ఉందో ఈయన వివరించడానికి ప్రయత్నం చేశారు

ప్రజాస్వామ్యం గెలవాలని జన హక్కులు గెలవాలని ప్రజాస్వామ్యంలో హక్కులు రక్షించబడాలని ఈయన కోరుకుంటున్నారు.

ప్రధానోపాధ్యాయులుగా పదవీ విరమణ చేసిన కవి ఎనిశెట్టి గంగా ప్రసాద్ గారు సమాజంలోని దుశ్చర్యలకు చలించి కలం పట్టి కవితలు రాసి సమాజ మార్పు కోసం పరితపిస్తున్నారు ఈయన ప్రతి కవితలో ఆలోచింపజేసే గుణాన్ని చైతన్య ధారగా కదిలే గుణాన్ని మనం చూడవచ్చు ఈయన కవితలనే కాకుండా గేయాలను పద్యాలను కూడా రాస్తారు చక్కటి స్వరంతో పాడతారు తన ఐదవ పుస్తకంగా పొద్దుపొడుపు సూర్యుడు పుస్తకాన్ని మన ముందుకు తెచ్చారు ఈ పుస్తకం నిండా ఆలోచింపజేసే కవిత్వం తో పాటు చైతన్య పరిచే గేయాలు ఉన్నాయి కామారెడ్డిలో తెలంగాణ రచయితల వేదిక ఆధ్వర్యంలో ప్రతినెల నిర్వహించే ఎన్నీల ముచ్చట్లు కార్యక్రమానికి ప్రధాన సమన్వయకర్తగా వ్యవహరిస్తూ కవిత్వ సృజనలో మెలకువలను అందరికీ అందిస్తూ కవిత్వం రాస్తున్న ఈయన పొద్దుపొడుపు సూర్యుడు పుస్తకంలో 95 కవితలను అందించి అందరినీ ఆలోచింప చేస్తున్నారు.

ఈ పుస్తకంలో ప్రశ్న యువకిశోరం. అంజలి రైతు గీతం మౌనరోధన నినాదం జీవితమంటే కవిత్వమంటే అమ్మతనం అన్ని ప్రశ్నలే. నా ఓటు విమర్శకుడు వైద్యులకు వందనం. ఓటు విలువ జనం గుప్పిట మార్గదర్శనం దర్పణం తస్మాత్ జాగ్రత్త నిశ్శబ్ద సవ్వడి ఆశల హరివిల్లు మేఘసందేశం. లాంటి మంచి కవితలను అందించినారు

ఈ పుస్తకం ప్రతి ఒక్కరూ చదవదగినది దీనిలో యువకులకు సందేశం ఉంది సమాజానికి సందేశముంది కవి పడిన బాధ ఉంది కవి ఆవేశం ఉంది మంచి వాక్యాలు దిశా నిర్దేశాలు. ప్రతి కవితలో మనం చూడగలుగుతాము. కాబట్టి ఈ పుస్తకాన్ని అందరూ చదవదగినదిగా భావిస్తూ.

ఎని శెట్టి గంగా ప్రసాద్ గారు కవిత్వ సృజనలో చేస్తున్న కృషిని అభినందిస్తూ పాఠకులు ఈ పుస్తకాన్ని ఆదరిస్తారని కోరుకుంటు మీ .....

ప్రతులకు:
**యెనిశెట్టి గంగా ప్రసాద్**
సెల్:9866447234



–సిరిసిల్లా గఫూర్ శిక్షక్
9849062038

## సెల్‌ఫోను!

ఆ॥వె॥ లొల్లివెట్టవట్టే సెల్లు ఫోనీనాదు
సొల్లు కబురులెన్నొ సోకులెన్నొ
ఆత్మ గల్లవారలడిగి సచ్చినగాని
పట్టినట్టు యుండవట్టె యువత!

కం॥ అరచేతిలోనె విశ్వము
పరుగుల పెట్టించు కనుల పండుగవోలెన్
మురిపెము నింపుచు ననిశము
యురకలు బెట్టించుటేమి యుత్సాహమహొ!

కం॥ దినరాత్రులు సెల్ఫోనున
పనులన్నియు మానివేసి పరులకు నెపుడున్
తన యనుభూతిని దెల్పుచు
తనకాలము వ్యర్థ పుచ్చెదరు మనుజులిలన్!

కం॥ ఇదియేమి మాయజాలము
ఇదియేమి విచిత్రమాయె యెంతని దెలుపన్
అదుపన్నది లేనియెడల
తుదిమొదలే లేకజనులు దూరెదండుముల్!

ఆ॥వె॥ అవసరమునుబట్టి యరుదుగా సెల్ఫోను
మితమువాడుకున్న మేలుగలుగు
అవసరానికన్నధికంగవాడిన
నష్టములు భరించ కష్టముగద!

ఆ॥వె॥ ఎవ్వరికిని వారలెచ్చోలు జూచిన
పలుకరింపులన్ని పలుచనాయె
"సెల్లుఫోను" మాయ చెప్పతరముగాక
మాటలన్ని పద్యబాటబట్టె!



– సుప్పని సత్యనారాయణ
సెల్: 9492626910

## గాయం పాడిన గేయం

ఉండుండీ
ఒక్కసారీ దుఃఖ దొంతరల్లోకి
జారిపోతాను .
ఎప్పటికప్పుడు
వ్యూహాలు పదును పెట్టడం
కన్నీటిని చెక్కడం
సుఖమయ ప్రయాణాలుగా మల్చడం.
లోతుగా జీవితాన్ని తరచిచూడటం
తడిమి చూడటం
ఒక లక్ష్యం వైపు దూసుకు పోవటం
నిరంతర శ్రమలోంచి
దారుల్ని వెలిగించటం
తృప్తిని ఆస్వాదిస్తూ అలా
అడుగులు సాగుతుంటాయి .
నిద్రలేని రాత్రుల్ని
గాయం పాడిన గేయం
ఓదార్చుతుంది .
మౌన ప్రపంచంలోంచి లేచి
భావాలు భాషిల్లుతుంటాయి .
ఇక్కడ విషాదమేమిటంటే
పరిగెత్తేవేగానికి
నన్ను నేను
సమాధాన పరచుకోవడమే .



–గవిడి శ్రీనివాస్
08886174458

## విజయపుదారుల్లోకి..

కొత్తకొత్త సూర్యోదయాలు
కొంగొత్త ఆలోచనల దారుల్లో
కోరికలుదయిస్తుంటయ్
ఊహలకు రెక్కలొస్తుంటే..

మనిషి విహంగమై సంచరిస్తూ
ఆకాంక్షలనెన్నో అద్దుకుని
ఆరాటంగా పోరాటంచేస్తూ
నిరాశతీరాలెన్నెదురొచ్చినా
పయనమైతే సాగుతుంటది.

తన స్వప్నాల సాకారానికై
భవిష్యత్తుకు గౌరవాన్నద్దుకోవాలని
వర్తమానాన్ని చెక్కుతున్న శిల్పొతున్నడు
వెనుదిరగని ధీరుత్వాన్నద్దుతున్నడు.

అడుగడుగునా అడ్డంకుల
శిఖరాలనదిరోహిస్తూ

అలుపులేనితనాన్ని మదినింపుకుని
మౌనమునిలా దీక్షబూని అరిషడ్వర్గాలను జయిస్తూ
చైతన్యగీతమై ఉదయిస్తున్నడు.

నేడు పోటిపడడమంటే సప్తసముద్రాలీదడమే
సాధించడమంటే యుద్ధాన్ని గెలవడమే
అపజయాలెన్నెదురౌతున్నా
తిరిగి పోటిలో నిలవడమే
విజయపుదారుల్లోకి వినయంగా చేరడమే.

దూరమెంతున్నా భారమనకుండా
గెలుపుతీరంకై సాగాల్సిందే
ఎవరైనా ఎక్కడైనా..!



-సి. శేఖర్(సియస్సార్),
9010480557.

## పరివర్తన (కథ)

రాము రాజు ఇద్దరూ మంచి స్నేహితులు రాము చదువులో ముందుండే వాడు ,కానీ రాజు ఎప్పుడూ ఏదో అల్లరి చేస్తూనే ఉంటాడు. ఊర్లో మామిడి తోటలో జామ తోటలో కాయలు దొంగతనం చేసి అమ్మి ఆ డబ్బులుతో పాన్ బీడా,గుట్కాలు నమిలేవాడు.

ఇంట్లో వాళ్ళు బుద్ధి మాటలు చెప్పినా మారడం లేదు. ఇంట్లో వాళ్ళ అమ్మ బడిత పూజ చేయడం సర్ది చెప్పడం పాఠశాలకు పంపడం పరిపాటి అయింది. చుట్టుపక్కల వాళ్ళు అందరూ కుక్క తోక వంకర అంటూ వేళాకోళం చేసే వాళ్ళు.

లక్ష్మి శంకరయ్య ల ఒక్కగానొక్క బిడ్డ రాజు. రాజు ఇలా దొంగతనాలు చేస్తుండడంతో శంకరయ్య ఊరిలో తల ఎత్తుకో లేక పోతున్నాడు. ఒకరోజు దారిలో రాజుకు తెలుగు మాస్టారు ఎదురుపడ్డాడు. ఏం శంకరయ్య బాగున్నావా అన్నాడు. శంకరయ్య బోరున విలపిస్తూ రాజు రోజురోజుకు పెంకీల తయారవుతున్నాడు ఎన్నిసార్లు చెప్పినా మందలించినా ఆ దొంగతనం చేసే బుద్ధి పోలేదు.

మాస్టారు ఎలాగైనా మా వాడిని మీరే మార్చాలి అంటూ చేతులు జోడించాడు. శంకరయ్య బాధపడకు రాజు మంచి కుర్రవాడే ఏదో తెలియక చిన్నతనంతో అలా చేస్తూ ఉంటాడు నేను తనకు అర్థమయ్యేలా చెప్తాను సరేనా.. ఇక అతను దొంగతనాలు చేయడం మానేస్తాడు. నాది బాధ్యత అంటూ హామీ ఇచ్చాడు తెలుగు మాస్టారు.

అంతా మీ దయ మీరు ఆ పని చేయగల సమర్థులు అని మీతో నా బాధ వెళ్లబోసుకున్న మాస్టారు అని చెప్పి శంకరయ్య అక్కడి నుండి వెళ్ళిపోయాడు.

పాఠశాలకు వచ్చిన తెలుగు మాస్టారు జాతీయాలు సామెతలు పాఠ్యాంశం చెబుతూ కుక్క తోక వంకర, రెక్కాడితే గానీ డొక్కాడదు .నీరు పల్లం యెరుగు..నిజం దేవుడెరుగుఅంటూ కొన్ని సామెతలు చెప్పాడు.

ప్రతి రోజు ఇంట్లో తాను వింటున్నా సామెత కుక్క తోక వంకర. రాజు గాడికి వెంటనే కుక్క తోక వంకర అనేదానికి అర్థం తెలుసుకోవాలనిపించి అదే విషయం మాస్టారు ని అడిగాడు

మాస్టారు నవ్వుతూ దీనికి అర్థం రేపు చెబుతా కానీ ఇవాళ పిల్లలూ ఊరంతా పరిశీలించి, తోక వంకర లేని కుక్కను తీసుకురావాలి. ఎవరైతే తీసుకొస్తారు వారికి బహుమతి ఉంటుంది అని చెప్పాడు. పిల్లలంతా ఉత్సాహంగా సరే అన్నారు. రాజు రాము ఇద్దరూ బడి బడి లేక ఊరంతా వెతికారు ఎక్కడ వంకర లేని తోక ఉన్న కుక్క కనబడలేదు. నిరాశగా ఇంటికి చేరిన రాజుకి తళుక్కున ఒక ఆలోచన వచ్చింది. వెంటనే తన పెంపుడు కుక్క తోకకు దబ్బలు వేసి గట్టిగా కట్టాడు.

ఉదయం పాఠశాలకు తీసుకెళ్లి తెలుగు మాస్టారు ముందర నిలబెట్టాడు.అందరూ చప్పట్లు కొట్టారు.

తెలుగు మాస్టారు చుట్టూ పరికించి రాజు వైపు చూసి నవ్వుతూ ఆ కట్లు విప్పు అన్నాడు కట్లు విప్పగానే తోక యధాస్థితికి వచ్చేసింది. తనకు కుక్క వైపు గుర్రుగా చూస్తూ తలదించుకున్నాడు రాజు. తెలుగు మాస్టారు రాజు నీ దగ్గరికి తీసుకుని భుజంపై తట్టి పిల్లలను ఉద్దేశించి కుక్క సహజలక్షణం తోక వంకర గా ఉండడం. ఎన్ని ప్రయత్నాలు చేసినా కుక్క తోకను నేరుగా మార్చలేము

ప్రతి మనిషిలోనూ ఏదో ఒక అవలక్షణం ఉండే ఉంటుంది మన శ్రేయోభిలాషులు పెద్దవాళ్ళు అలవాటు మార్చుకోమని సామవేద దాన దండోపాయాలు ఉపయోగించి చెప్పినా మారకపోతే అలాంటి వారిని కుక్క తోక వంకర అంటారు. అంటే మనిషికి అవలక్షణం సహజ లక్షణం గా మారి ఎప్పటికీ మంచి నేర్చుకోడు అన్న ఉద్దేశంతో ఆ మాటను అంటుంటారు.

ఆలోచించే జ్ఞానం లేని కుక్కే తన సహజలక్షణం కొరకుమొండిగా ప్రవర్తిస్తుంది. ఆలోచించే జ్ఞానం కలిగిన మనం అలా ఉండొచ్చా మనలోని చెడును తుంచి మనుషులుగా మారాలి కదా అప్పుడే కదా చదువుకున్నందుకు అర్థం పరమార్థం అన్నాడు.

తన ప్రవర్తన కోసమే మాస్టారు ఇంత చెప్పాడని అర్థమైన రాజు సిగ్గుపడ్డాడు. ఇకపై తను దొంగతనం అనే చెడు అలవాటుని మాని జ్ఞానవంతుడు అని రుజువు చేసుకోవాలని నిశ్చయించుకున్నాడు.దొంగతనం మాని మంచి విద్యార్థిగా మారాడు.

తల్లిదండ్రులు సంతోషించారు.



–లతా శ్రీ
9666779103

## బుడ్డ పరకలు

రైతు రైఫిలై
నిజాం మీద
పోరాడిన నేల ఇది.
వారసత్వం నడుస్తాంది

నాగలి పట్టరాదు
కోండ్ర దున్నరాదు
రైతు భాందవుడని
పటాటోపం!

పేపర్ చూస్తే
కన్నీళ్ళు దునుకుతయి
పేజీ మేకప్ అంతా
నెత్తురు తోనే

సింగరేణి గని
లక్షల మంది
జీవితాలను
వెలిగించే పావలి

–అన్నవరం దేవేందర్

## ఆడపిల్ల (కథ)

అనగనగా రామాపురం అనే గ్రామంలో రామయ్య సీతమ్మ అనే దంపతులు ఉండేవారు వాళ్ళిద్దరికీ ఇద్దరు సంతానం కలిగారు.ఒక బాబు ఒక పాప. బాబు పేరు కన్నయ్య పాప పేరు బుజ్జి రామయ్యకు కన్నయ్య అంటే చాలా ఇష్టం ఉండేది బుజ్జి అంటే ఆడపిల్లని ఇష్టం లేకపోయింది కన్నయ్యను పెద్ద కార్పొరేట్ బడిలో చదివిస్తూ బుజ్జిని మాత్రం చిన్న బడిలో చదివిస్తున్నాడు.

ప్రతి విషయంలో కొడుకును మంచిగా చూసుకొనేవాడు. కూతురును తక్కువ చేసి చూసేవాడు. అలా చూడవద్దని సీతమ్మ రామయ్యకు ఎన్నిసార్లు చెప్పినా అతనిలో మార్పు రాలేదు.

కొన్ని రోజుల తరువాత సీతమ్మ చనిపోయింది. సీతమ్మ చనిపోయాక రామయ్య కన్నయ్యను చాలా బాగా చూసుకుంటూ ఎప్పుడు బుజ్జిని తిట్టేవాడు. బుజ్జి ఒంటరయ్యింది. ఎప్పుడు దిగులుగా ఉండేది. బుజ్జి ఉన్న పరిస్థితి తెలుసుకొని ఉపాధ్యాయులు ఆమెను బాగా చదువుకొమ్మని ప్రోత్సహించారు. తను చదువు మీద ధ్యాస పెట్టింది, ఇంట్లో పని చేసుకుంటూ చదువుకుంటూ ఉన్నంతలోనే సంతోషంగా ఉండేది. అంత పెద్ద బడిలో చదివినా కన్నయ్యకు చదువుమీద శ్రద్ధ లేకపోవడం వలన అతను పదవ తరగతి కూడా పాస్ కాలేకపోయాడు.

కొన్ని రోజుల తర్వాత కన్నయ్య తండ్రిని డబ్బులు అడుక్కొని ఊరు మీద పడి తిరగడం మొదలు పెట్టాడు. తండ్రి ఏమైనా అంటే ఎదురు సమాధానం చెప్పేవాడు. బాగా చదవడం వలన బుజ్జికి ఉద్యోగం వచ్చింది. ఒక రోజు రామయ్య ఇంట్లో జారిపడ్డాడు కాలుకు గాయమైంది. కన్నయ్య అదేమీ పట్టించుకోకుండా ఎప్పటిలాగే తిరుగుతుండేవాడు. కానీ బుజ్జి మాత్రం తన తండ్రికి దెబ్బతగలడం వలన ఉద్యోగంకి వెళ్లక సెలవు పెట్టి ఇంటి దగ్గరే ఉండి అతన్ని బాగా చూసుకున్నది. దాంతో రామయ్య తొందరలోనే కొలుకున్నాడు.

రామయ్యకు తను చేసిన తప్పు అర్థం అయ్యింది. అతి గారాభం వలన తన కొడుకు ఎందుకు పనికిరాకుండా పోయాడని బాధపడ్డాడు. కొడుకు అయినా కూతురు అయినా ఇద్దరిని సమానంగా పెంచాలి అని మనసులో అనుకున్నాడు. తను చేసిన తప్పుకు బిడ్డను క్షమాపణ అడిగాడు.



**–వేల్పుల శ్రీలత,** 9వ తరగతి
జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల
నర్శింహుల పల్లి, ధర్మారం మండలం,.

## బతుకు చెరుపుకుంటున్నరు..!

అడవులను నరుకుతూ
అమ్మకానికి పెడుతూ
ఆదివాసుల పొట్టకొడుతూ
ఆగం చేస్తున్నరు...
కాంక్రీటు వనాలు నిలుపుతూ
కాలుష్యాన్ని పెంచుతూ
కాలాన్ని మార్పులకు గురిచేస్తూ
కష్టాలు పెడుతున్నరు..
విరివిగా రసాయనాలాడుతూ
భూసారమును తగ్గిస్తూ
భూ,జలచరజీవుల ప్రాణాలు తీస్తూ
సమతుల్యత పోగొడుతున్నరు..
పచ్చని చెట్ల ప్రాణం తీస్తూ
ఫ్యాక్టరీలకు ఆజ్యం పోస్తూ
పొగతో గాలి కాలుష్యం చేస్తూ
రోగాలకు గురిచేస్తున్నరు..
రోజు రోజుకంతా
రోగాలెక్కువవుతుండెను
నూరేండ్ల జీవితానికి
నిమ్మలం లేకుంటాయెను
అర్థాయుష్షు తోడ
అంపశయ్య నెక్కుతుండెను
జీవిగంజి దొరుకకనే
జీవినొదులుతుండెను
ఈ ఘోరాన్ని కండ్లారా చూసి
కాపాడలేకున్నము
జరిగేటి నష్టము తెలిసి
జాగృతి కాలేక పోతున్నము
ఇదేనా ధర్మం..ఇదేనా కర్తవ్యం..!
కలిసి కదలండి ముందుకు
రక్షణ కల్పించుకొండి బతుకులకు...!!




–పసుల. శంకర్
9542181301

పుస్తక సమీక్ష

# కవిత్వంతో గగనంలో విహరింపజేసిన అనూశ్రీ






అనుశ్రీ కలం పేరు, అసలు పేరు గౌరోజు కృపారాణి. వీరు గతంలో కెరటాలు కవితా సంపుటిని వెలువరించారు. ఆ పుస్తకాన్ని ఉదయ సాహితీ కరీంనగర్ సంస్థ ద్వారా తెలంగాణ సాహిత్య అకాడమీ పూర్వ అధ్యక్షులు నందిని సిధారెడ్డి గారు ఆవిష్కరించారు. గగనంతో పాటు దోసిట్లో చందమమ కవితా సంపుటి ,అంతేగాక ఎన్నో సమీక్షలు కథలు రాసారూ... రాస్తున్నారు.

దుఃఖం, ఆనందం, విషాదం, ఎదుర్కొన్న అనుభవాలు,ఎదురీదిన సమస్యలు మనిషిలోని మనసును తట్టి లేపుతాయి. ఆ హృదయం తన భావనలను, ఆలోచనలను, స్పందనలను ఏదో ఒక రూపంలో పంచుకోవడానికి ప్రయత్నిస్తుంది .అలా అనుశ్రీ తన భావోద్వేగాలను అక్షరాలుగా మలుచుకొని సంస్కారవంతమైన కవిత్వాన్ని మనకు ''గగనం'' రూపంలో అందించారు .

మనిషి అనుభవంలోంచి పుట్టుకొచ్చిన కవిత్వంలో జీవం ఉంటుంది. అలా కెరటాలు కవితా సంపుటితో మొదటి అడుగువేసింది. సృజనతో ఒక కొత్త కవితా రూపం "శ్రీపదాలను" సాహితీ లోకానికి పరిచయం చేసింది. శ్రీపదాలను శ్రీలుగా భావించిన ఎంతోమంది సృజనకారులు తమ సొంతం చేసుకొని ఆ కవితా రూపంలో ఒక సంకలనంతో పాటు, సంపుటిలను వెలువరించడం అభినందించదగ్గ విషయం.

ప్రస్తుతం గగనం వైవిధ్యమైన వస్తువుల ఎంపికతో, నవ్యత కలిగిన శీర్షికలతో మనముందుకు వచ్చింది. ఇందులో 101 కవితలున్నాయి. ఈ కవితలు దేనికదే ప్రత్యేకతను సంతరించుకున్నాయి. ఈ గ్రంథానికి స్వేచ్ఛగా విహరిస్తున్న పక్షులతో కూడిన ఆకాశం కవర్ పేజీగా అందించిన సురేష్ రావు కోలా గారికి అభినందనలు.

"ఆలోచనలు గగనమంత ఉన్నతమై ఎదిగితే అనుభూతులు ముత్యాల చినుకులు కురుస్తాయి. ఒడిసి పట్టుకోగల దోసిలిలో వచ్చని అంకురాలవుతాయి. అవి అక్షరాలే అయితే శాశ్వతమై మిగిలి పోతాయి. జీవిత గమనంలో ఏర్పడే ఆటంకాల మబ్బులను ఎప్పటికప్పుడు విదిల్చుకుంటూ మళ్లీ ప్రశాంతతను మదిలో నిలుపుకుంటూ అక్షరాలే ఆలంబనగా పయనిస్తున్నాను. సాహిత్యంతో సహవాసం గగనంలో విహారంతో సమానం. మురిపిస్తూ, మైమరిపిస్తూ,ఓదార్చుతూ, ధైర్యమిస్తూ అక్షరమే నేస్తమై హత్తుకున్నాక ఒక్కక్షణం ఒంటరికాలేదు జీవితం" అంటూతన హృదయావిష్కరణని ముందుగానే తెలియజేసింది కవయిత్రి .అక్షరం తన తోడై నిలిచాక ఆమె జీవితంలో వెలుగు వచ్చింది. నిజంగా అక్షరమే ఆమె జీవితమై పరుగులు పెట్టింది. ఆ పరుగుల పందేరంలో వికసించిన కవితల పుష్పాల మాలయే ఈ గగనం.

గగనంలో శీర్షికలు పెట్టడంలో ఆమెకు మంచి పట్టు ఉన్నట్లు మనకర్థమౌతుంది. శీర్షికల నిర్ణయంలో కొత్తదనం ఓ ప్రత్యేకత కనిపిస్తుంది. కాసింత సమయం, తుదివాక్యం, ముసుగు లేయండి, మనసైనశత్రువు, మరిచిన విలువ, ద్రౌపది శపథం, ఎడారి స్వప్నం, అగ్ని కంచె, చీకటిని తాగబోకు, గోడలకే ప్రాణం ఉంటె, టీ కప్పులో తుఫాన్ లాంటి శీర్షికలు పాఠకుల్ని కట్టిపడేస్తాయి. తెలుసుకోవాలన్న ఉత్సుకతను రేకెత్తిస్తాయి. కవిత ఆసాంతం చదివేదాక మనల్ని కుదురుగా ఉండనీయకుండా చేస్తాయి. కవిగా మనం చేయవలసిందే అదే... శీర్షిక చూడగానే చదవాలన్పించేలా ఉండాలి. అసక్తిని కలిగించి అభిరుచిని పెంపొందించేలా ఉండాలి. అందులో అనుశ్రీ గారు విజయం సాధించారనే చెప్పవచ్చు. నిన్నటివరకు నిర్జీవంగా ఉన్న విత్తనాలు "చినుకు తడి తగలగానే/కొత్త ఊపిరిపీల్చుకుంటూ/ చిగురులతో చిరునవ్వులయ్యాయి/మానవ జాతి మనుగడకై/మరోసారి సన్నద్ధమయ్యాయి/మంచినే కాదు స్ఫూర్తిని అందిస్తూ"

నిరాశా నిస్పృహలకు లోనైన వ్యక్తులు బ్రతుకుపై ఆశ వదులుకొని ప్రాణాలు తీసుకునేవారికి "విజయకేతనం" చక్కని మార్గాన్ని చూపుతుంది. ఓ విత్తనం చినుకుతో ఎదగడానికి ప్రయత్నించి నపుడు అన్ని అవయవాలుండి ఆలోచనలు కలిగి ఉన్న మనిషి కెందుకు సాధ్యం కాదు? ఒక్కసారి మనసులో ఈ ప్రశ్న వేసుకుంటె ఆత్మహత్యలంటూ ఉండవు.

ఈ లోకంలో ఎదుటివాడి లోపాన్ని ఎత్తిచూపుతూ ఎగతాళి మాటలతో బాధపెట్టడమే చాలా మందికి తెలుసు. కానీ ఆ ఎగతాళి మాటల పదునెంతో వారికి తెలియదు. అయినా ఈ సమాజం నన్ను ఎంతగా గాయపరచినా , బాధించినా నన్ను నేను నిలదొక్కుకోగలిగాను. సమాజంలో మనిషి, అవసరం కోసం, ఆపన్న హస్తం కోసం ఎదురుచూసినప్పుడు సహాయం అందించిన వ్యక్తి దైవంగా నిలుస్తాడు. పరిస్థితిని ఎదుర్కొని నిబ్బరంగా నిలిచాక సహాయం చేయడానికిచేయి చాపితే ప్రయోజనం ఏమిటి? అయినా తాను ఎగతాళి చేసేవారిలో లేనని, తన్ను బాధించినవారు ఏ కలతకులోనైనా ఒక్కసారి నన్ను తలుచుకుంటే చల్లని చెలిమి చెలమనై నీ బాధని తీరుస్తానని తెలుపుతుంది. ఇక్కడ ఉపకారికి ఉపకారము పద్యం గుర్తుకువస్తుంది .ఎవరేమన్నా ఓరిమి వహించాలని, అవసరమైతే అలాంటి వారిని ఆదరించి అక్కున చేర్చుకోవాలని తెలుపడం ఉన్నతమైన వ్యక్తిత్వానికి ప్రతీక.

శాస్త్ర సాంకేతిక రంగాల పురోభివృద్ధిలో జీవనం యాంత్రికమైన దశలో పల్లెటూరులోని హస్తకళలని గుర్తుకు చేస్తూ మానవుని సృజనతో మేలుకున్న మేధస్సుకు తార్కాణాలు ఈ హస్త కళలు అంటూ మనల్ని గతంలోకి తీసుకువెళ్తుంది

ఆడదానికి రక్షణ కరువైన ఈ రోజుల్లో స్త్రీలు ఎదుర్కొంటున్న మానభంగాలు, మృగాల చేతుల్లో అంతమవుతున్న కన్నెపిల్లల జీవితాలు, ప్రతిక్షణం ఎక్కడో ఒకచోట ఆడదాన్ని లైంగిక హింసకు గురి చేస్తున్న సంఘటనలు, వీటన్నిటికీ అమ్మే తుది వాక్యం పలకాలని,తన కడుపు తీపి మరొకరి కడుపు కోత కారాదని, తప్పు చేసిన కొడుకుని దండించక తప్పదని నేటి మాతృమూర్తులు అందుకు సిద్ధంగా ఉండాలని ఒక హెచ్చరికను "తుదివాక్యం"గా జారీచేయడం అభినందనీయం.

నేటి సమాజంలో చిన్న చిన్న కారణాలతో మనస్పర్ధలకులోనై, అపార్థాలకు లొంగి, దాంపత్య జీవితాన్నిమధ్యలోనే తుంచివేసుకుంటున్న దంపతులకు చురకలా సాగిన కవిత సాఫల్యం. "విశాలమైన హృదయంలో ఏదైనా విప్పి చెప్పుకోగల స్వతంత్రం" ఉన్నచోట దాంపత్యం పరిమళభరిత మౌతుంది."ఇరువురు ఒకే దారంట నడవడం/అది పూరిగుడిసెకు చేర్చినా/రంగుల మేడలోకి చేర్చినా /ఇరువురి హృదయ మందిరమవడం". అదే దాంపత్య సాఫల్యానికి ప్రతీకగా పేర్కొనడం గమనార్హం

మన జీవితాలలో ఎంతోమంది వస్తుంటారు పోతుంటారు. కానీ కొంతమంది వ్యక్తులు మాత్రమే మన జీవితంలో నిలిచిపోతుంటారు. అలాంటి వ్యక్తులు మనకు తోడుగా ఉన్నప్పుడు ఈలోకం సింగిడి లా తోస్తుంది. మనం తిరిగిన ప్రదేశాలు పరిచయాలు గడిపిన అనుభవాలన్ని మధురంగా ఉంటాయి. మనకు ఇష్టమైన వ్యక్తి దూరమైనప్పుడు అవే పరిసరాలు అవే ప్రదేశాలు అవే అనుభవాలు మనల్ని ఒంటరిగా నిలబడతాయి అపరిచితంగా పరాయితనమేదో మనల్ని అడ్డుకున్నట్టుగా దూరంగా నిలబెడ తాయి. ఇది ప్రతి ఒక్కరికీ అనుభవమైన విషయమే .అదే విషయాన్ని "పరాయి" కవితలో మన ముందుంచారు.

మనిషి తన అవసరం కోసం సృష్టించిన డబ్బు బంధాలని ఎలా విచ్ఛిన్నం చేస్తుందో, మనుషుల్ని ఎలా దూరం చేస్తుందో చెల్లని నోటు ద్వారా తెలియజేశారు. డబ్బు చేరాక మమతలు సైతం కొలతల్లో ఇవ్వడం ప్లాస్టిక్ పూల అలంకారాలు మన మధ్యలో చేరి మనసులని, మనుషుల్ని దూరం చేశాయని తెలుపుతూ ఎన్ని ధన రాశులున్నా మనోవేదననీ మాత్రం డబ్బు దూరం చేయలేదని,అది మనసున్న మనుషులవల్లే సాధ్యమౌతుందని అంతర్లీనంగా మనకు అందించారు.

కాలాన్ని మరిచి కాసుల వెంట పరుగులు తీస్తూ బంధుత్వాలకు దూరంగా ఊరిని ఉనికిని మరిచి ప్రయాస పడుతున్న నాగరికత ధోరణి గురించి ,అంతస్తులు ఎదిగిన కొలది అల్పత్వం చేరుతుంటే మానవత్వం దూరమై మనిషిని మనిషి పలకరించని తత్వం ఎదిగి, ఆత్మీయతలు అనుబంధాలు దూరమైనా, అనామక జీవితం ఎవరి కోసం? ఈ ప్రశ్న వేస్తూ మమతలు పంచే మంచి మనిషిగా నలుగురు తలుచుకుననే ప్రేమవైతే చాలదా! అంటూ మనిషి, మనిషి కోసం ఏం చేయాలో ఎలా బ్రతకాలో "ఆగని పరుగు" కవితలో తెలిపారూ. బంధనాలు తెంచుకొని ఆశలు పెంచుకొని,ఆశయాలు తుంచుకొని పరుగులు పెడుతున్న ఈనాటి యువతకు ఈ కవిత కనువిప్పు కలిగిస్తుంది.

నేటి సమాజంలో లైంగిక దాడికి గురి అయిన స్త్రీకి సమాజంలో విలువలేదు. చిన్నచూపు చూస్తుంది. అసలు మనిషిగానే గుర్తించదు కానీ తను చేయని తప్పుకు ఎందుకు శిక్షించబడాలి? "పశుబలంతో దాడి చేసిన మృగం/ జనారణ్యంలో కలిసి కనుమరుగైన/ నీలోంచి నీవు పోలేదు/ నీలాగే ఉన్నావు/ గాయమైతే మందునెలా నూరాలో నేర్చుకో/ తనువుకే గాయం మనసు మహోజ్వలం/నిన్ను తాకబోయే ఎన్నో బాధల శరాలను /బూడిద చేసేందుకు/ ఆత్మబలాన్ని నీ చుట్టూ అగ్నికంచెగా /ఇకనైనా నిర్మించుకో ...ఎవరో చేసిన పాపానికి నీవెందుకు బలి కావాలి? ధైర్యంగా కదులు...నిర్భయంగా నిలు"...అంటూ స్త్రీని వెన్నుతట్టే కవిత "అగ్నికంచె"

ఇలా గగనం కవిత సంపుటిలోని ప్రతి కవితను స్పృశించాలని ఉంది. అనుశ్రీ కవిత్వంలో తాత్వికత ఉంది. సమాజంలోని సమస్యలపై స్పందన ఉంది. మానవీయ కోణాముంది. స్త్రీల సమస్యలపట్ల మంచి అవగాహన ఉంది. సమస్యలను ఎత్తి చూపడమే కాదు పరిష్కార దిశలో కూడా ఈమె కవిత్వం సాగింది. ఎదుటివారితో సంభాషిస్తున్నట్లుగా కొనసాగే లక్షణము అనుశ్రీ కవితలలో కనిపిస్తుంది. సరళమైన భాషా ప్రయోగం,చక్కని శైలి,విలక్షణమైన శీర్షికలు ,వైవిధ్యమైన వస్తువులు కమ్మెచ్చు నుండి సాగిన తీగలాగా కొనసాగే కవిత్వ ధార,జీవిత అనుభవ సారం, వెరసిఅనుశ్రీ "గగనం"

ప్రతులకు :అనూశ్రీ గౌరోజు
17-4-240/23, తిలక్ నగర్
గోదావరిఖని,పెద్దపల్లి జిల్లా
చరవాణి : 9666688370



సమీక్షకులు :
- డా వైరాగ్యం ప్రభాకర్
90145 59059

(కథ)

# చీమల పోరాటం



గుడి గోపురం కిందున్న ఉన్న స్థలంలో పావురం తన పిల్లలతో ఆడుకుంటోంది. ఆహారం కోసం చిట్టి నోర్లు తెరుస్తున్న తన పిల్లలను చూస్తుంటే తల్లి పావురానికి మరింత ఆనందంగా ఉంది. అందులోనూ ఒక బిడ్డ తెల్లగా ఉండటాన్ని చూసన్తూ మరింతగా మురిసిపోతోంది. ఈ విషయం అన్నింటికీ తెలపాలి. తన ఇంట్లో శాంతి పావురం.. తలుచుకుంటేనే ఒళ్ళు ఏదోలా అయిపోతోంది. పక్షులన్నింటికీ చిన్నపాటి విందు ఇవ్వాలని ఆలోచనలో ఉంది. ఇంతలో పిల్లల కేరింతలతో పాటు సన్నపాటి స్వరం ఏదో వినిపిస్తోంది. దాంతో మరింత శ్రద్ధగా చెవుల్ని రిక్కించింది. అది రాగం కాదు ఏడుపు. ఎవరేడుస్తున్నారు? అదీ ఈ ప్రాంతంలో ? ఎంత వెదికినా ఎవరూ కనిపించడం లేదే? అనే ఆలోచనతో పిల్లల్ని ఒక పక్కగా జరిపి, నిద్ర బుచ్చి ఏడుపు వినిపిస్తున్న వైపుగా మెల్లగా తన గూ గూ స్వరాన్ని సైతం ఆపి వెళ్ళింది. ఎవరూ కనిపించడం లేదు. ఉన్నట్లుండి ఏడుపు శబ్దం దగ్గరైంది. మెల్లగా నడుస్తూ వెళ్ళగానే తన కాలిని చీమ గట్టిగా కుట్టింది. 'అబ్బా" ఇపుడే ఈ చీమ కుట్టాలా? అనుకుంటూ ఒక్క దెబ్బ వేసేంతలో..

"ఆగు.. మిత్రమా! నువ్వు వెదుకుతున్నది నన్నే.." అంది.. చీమ మెల్లగా...

"ఆ! నేను వెదుకుతున్నది నిన్నా ? అదేమిటి ? ఇక్కడెవరో ఏడుస్తుంటే నేను వారికోసం చూస్తున్నా" అంది ఆశ్చర్యంగా పావురం.

"ఆ ఏడుస్తున్నది నేనే" అంది మరింత గట్టిగా ఏడుస్తూ ...

"నువ్వా? ఎందుకూ? బాగానే కుట్టావుగా" అంది పావురం తన నొప్పి వస్తున్న ప్రాంతాన్ని రుద్దుకుంటూ ...

"కుట్టడం నా నైజం. చంపడం మీ నైజం" అంది కళ్ళు తుడుచుకుంటూ చీమ ...

"ఆ తేడా ఏమిటో?" అది చిరాకుగా చూస్తూ

"నేను కుడితే నొప్పి వస్తుందంతే.. మీరైతే ఏకంగా ముక్కుతో చంపేస్తారు కదా?" అదే తేడా ?. అంది వెక్కుతూ చీమ.

"సరే.. ఆ విషయం వదిలేయి. ఇంతకీ నువ్వెందుకు ఏడుస్తున్నావు? నాకు చెప్పలేదు" అది పావురం.

"నా బాధలు ఒకటా రెండా? ఎన్నని చెప్పను? ఇపుడే నాకు నలుగురు పిల్లలు పుట్టారు. వారిని కోతి వచ్చి తొక్కి వెళ్ళింది. అవి పుట్టగానే చనిపోయాయి. నా బిడ్డల్ని నేను కనులారా చూసుకోనేలేదు. అపుడే చనిపోయాయి. ఈ రోజు కోతి. రేపు మరొకటి. ఎవరో ఒకరు, ఏదో ఒకటి మమ్మల్ని, మా జాతిని నిర్మూలం చేస్తున్నాయి. నువ్వే చెప్పు.. నీ బిడ్డల్ని పుట్టగానే చంపేస్తే నీకు బాధ అనిపించదా? చీటికీ మాటికీ ఎవరు పడితే వారు తొక్కి చంపేస్తే బాధ అనిపించదా? మా పాటికి మేము ఎండా కాలంలో పారేసిన ఆహారాన్ని తీసుకెళుతుంటే నీరు పోసి మానవులు చంపడం నేరం కాదా? పైగా మాపై మందులేసి చంపేయడం ఎంత అన్యాయం? ఏం బతికే హక్కు మాకు లేదా? అంతా మీకేనా?" అంది వెక్కిళ్ళు పెడుతూ పావురం ..

చీమ బాధలో న్యాయం ఉందనిపించింది. తన బిడ్డల్ని కాసేపు వదిలి రావాలంటేనే ఎవరి కంటా పడకుండా ఎంతో కష్ట పడి దాచి వచ్చింది తాను. అలాగే అందరికీ ఉంటుంది కదా? అనుకుంది. అయినా కాస్తంత చిరాకుగా ముఖం పెట్టి మానవులు ఎవరిని చంపరు? అందర్ని చంపేస్తారు. మమ్మల్నయితే తినేస్తారు. గద్దలు ఎత్తుకుపోతాయి. మా బాధలు మాకూ ఉన్నాయి. సరే! ఇపుడేం చేద్దాం.. ముందు నీవు ఏడుపు మానేస్తే మనకో పరిష్కారం దొరకుతుంది.

మా హక్కులకై మేము పోరాడతాం. ఇక్కడే కూర్చుని ధర్మ పోరాటం చేస్తాం. ఇపుడే అన్నింటినీ పిలిచాను. అన్నీ వస్తున్నాయి. చలి చీమలకు కూడా మద్దతు ఇస్తామని అన్నాయి" అనగానే పావురానికి నవ్వు వచ్చింది. దాచుకోలేక కిసుక్కున నవ్వింది.

"ఎందుకు నవ్వుతున్నావు? మేమంటే అంత లోకువా?" అంది కోపంగా తలెత్తి చీమ ..

"కాకపోతే ఏమిటి? మీరంతా ధర్మపోరాటం, ఉద్యమం చేస్తే చూసే వారెవరు? అక్కడక్కడా పుట్టల్లోనూ, బయటా కుప్పలు కుప్పలు ఉన్నా మిమ్మల్ని తొక్కి పోతున్నారు అందరూ. ఇపుడు నీ పోరాటానికి ఎవరు న్యాయం చేస్తారు? నాకయితే నమ్మకం లేదు" అంది పావురం ...

"శాంతి కపోతానివి నీవే అలా అంటే ఇక దిక్కెవరు మిత్రమా?" అంది దీనంగా చీమ ..

"నిజమే. మాలో కూడా తెల్ల వాటికే విలువ. చుక్కలు, డిజైన్లు, బూడిద రంగు ఉన్న మాలాంటి వారిని ఎవరూ పలకరించరు. ఇపుడే నాకు పుట్టిన నలుగురు బిడ్డల్లో ఒక బిడ్డ తెల్లగా ఉంది. అందుకే ఈ ఆనందాన్ని అందరికీ తెలపాలని అనుకుంటున్నాను. ఇంతలో నువ్వు ఎదురయ్యావు." అంది పావురం మురిసిపోతూ..

"అంటే నువ్వు శుభమా అని వెళుతుంటే నేను అశుభంగా ఎదురయ్యానన్నమాట" అంది దీనంగా చీమ ..

"అరె! అలా కాదు. విషయం చెబుతున్నానంతే! సరే! నువ్వయితే పోరాటం మొదలుపెట్టు. ఈ లోగా నేను నాకు కనిపించిన వాటన్నింటికీ నీ గురించి చెప్పుతూ నా బిడ్డ సంగతి కూడా చెప్పుకుని విందుకు పిలుచుకుంటాను. కాకపోతే ఒక వారగా కూర్చోండి. లేకంటే ఎవరైనా తొక్కేయగలరు. ఇందాకే ఒక గజరాజు నడుస్తూ ఇటువైపుగా వెళ్ళడం చూసాను." అంది భయంగా పావురం ...

ఆ మాట విన్న చీమ భయంతో వణికిపోయింది. పావురం చెప్పిన మాటతో కాస్తంత శాంతించింది. "సరే! నువ్వు వెళ్ళు. నా సంగతి మాత్రం గట్టిగా అందరికీ చెప్పు. ఆఖరికి మృగరాజును కూడా వదలద్దు" అంది చీమ.

"మృగరాజు ఎందుకూ? నేను మా జాతినే పిలుద్దామని అనుకుంటున్నాను" అంది చీమను చూస్తూ పావురం ....

"మరి నాకు అన్యాయం అందరూ చేస్తున్నారుగా..అంది దీనంగా చీమ.

చీమ వేదన చూడలేక అయిష్టంగానే "సరేలే! అందర్ని పిలుస్తాలే" అంది పావురం ...

పావురం పిలవడంలో, చీమ ఆవేదనని తెలియజేయడంలో ఎవరినీ వదలడం లేదు. చివరిగా నెమలి దగ్గరకి వెళ్ళింది. విషయాన్ని తెలియజేసింది. చీమల విషయం విన్న నెమలి ఒక నిర్ణయానికొచ్చింది. సరే! ముందా పోరాటం ఆపమని చెప్పు. పోరాటంతో దారి కాస్తే వస్తూ వెళుతున్న మనకే ఇబ్బంది. ఇంతకీ మిగతా వారంతా వస్తామన్నారా?" అడిగింది హుందాగా నెమలి

"నేనిచ్చే విందుకు అయితే అందరూ వస్తామన్నారు నెమలి రాజా! కాకుంటే చీమల విషయాన్నే చాలా సరదాగా తీసుకుని నవ్వుతున్నారు. కాకుంటే నేనే బతిమలాడాను. కాస్తంత ఓదార్చమని. కనీసం ఓదర్చితేనైనా వాటి బాధను మరచిపోతాయి కదా? అని" ఏమంటావు" అంది నవ్వుతూ ...

"అలా నవ్వడం సరైన పద్ధతి కాదు. న్యాయం చేయమని కోరడం తప్పు కాదు. బాధ అనేది మనదాకా వస్తేనే తప్ప బాధ కాదు అనే తత్త్వంలో మనం జీవించేస్తున్నాం. సరే! నేనూ పిల్లలతో వస్తాలే. కాకుంటే ఆహారం విషయంలో మేము చాలా జాగ్రత్తగా ఉంటాము. నీరు తప్పనిసరి. దేవాలయంలో ఉంటావు కదా? మాంసాహారాలు లాంటివి ఏమీ ఏర్పాటు చేయకు.." సరేనా?" అంటూ హెచ్చరించి మరీ పంపింది నెమలి రాజు.

జాతీయ పక్షి అయిన నెమలి మాటంటే అందరికీ మహా గౌరవం. తన హుందాతనం ఏ పక్షికి రాదంటే అతిశయోక్తి కాదు. అనుకుంటూ తదేకంగా నెమలి పిల్లల్ని ఆడించే విధానాన్ని చూసన్తూ ఎగురుకుంటూ వెళ్ళిపోయింది.

పావురం విందును ఆరగించడానికి పక్షులు అనేకం వచ్చాయి. అనేక పావురాలు దేవాలయాన్ని మరింత ద్విగుణీకృతం చేస్తున్నాయి. చిలక, నెమలి, పిచ్చుక, కాకి, వడ్రంగి పిట్ట, గద్దలు, రాబందులతో పాటు అనేక పక్షులు వచ్చాయి. కాకపోతే జంతువులు రావడానికి మాత్రం ఎంతో సందేహించాయి. మానవారణ్యంలోకి రావడానికి కుదరదనే విషయాన్ని తెలుసుకుని దూరంగానే ఉండిపోయాయి. కోతులు మాత్రం ధైర్యంగా, మూకుమ్మడిగానే వచ్చాయి.

చీమలు కూడా మౌనంగా ఒక వారగా కూర్చున్నాయి. అక్కడ వాటికోసమే పెట్టిన ఆహారాన్ని పిల్ల చీమలు తింటున్నాయి. ఇలాంటి వాతావరణంలో అన్నీ తృప్తిగా తిన్నాయి. ఆ తర్వాత ఒక్కొక్కటిగా సెలవు తీసుకుంటున్న తరుణంలో..

నెమలిరాజు ముందుకు వచ్చి "వెళ్ళకండి. అందరూ సమావేశంలో పాల్గొనండి" అనగానే అన్నీ ఎక్కడివక్కడ ఆగి పోయాయి. అందరినీ చూస్తూ "మిత్రులారా! మన పావురం అక్కకి తెల్లపావురం జన్మించింది. మీకు తెలుసు తెల్లని పావురం దేనికి చిహ్నమో. అందుకు మనమంతా అభినందనలు తెలుపుకుందాం.

ముఖ్యంగా మనం ఈ రోజు ఆలోచించాల్సిన విషయం ఒకటుంది. అది చీమల ఆవేదన. ఒకరు ఆవేదన చెందుతుంటే మరొకరు ఆనందపడేటంత మానవ హృదయాలు మనవి కాకూడదు. అందుకే ఈ రోజు వాటి ఆవేదనను విందాం అంటూ చీమల లీడర్‌ను పిలిపించింది. తమ ఆవేదన అంతా విన్న తర్వాత నెమలి అందరి వంకా చూసి "చెప్పడి మిత్రులారా! ఏమంటారు?" అంది నెమలి.

కాస్సేపయ్యాక గద్దలు ఎగురుకుంటూ వచ్చి "చీమలు అల్ప ప్రాణులు కనుక తప్పదు. దీనికేం పరిష్కారం ఉంటుంది..?" అంది గర్వంగా..

మరి కాస్సేపటికి చిలుక ముందుకు వచ్చి ఎవరికీ దొరకకుండా బతకడమే మంచిది. ఎందుకంటే కడుపు పోరాటం రాబందు కంటేనా వాటికి? ఒక మెతుకు తన నాలుగు రోజుల ఆహారం. అందుకోసం మనుషులున్న దగ్గరకి, పెద్ద ప్రాణాలు ఉన్న దగ్గరికి వెళ్ళడం మానుకుంటే ఈ వేదన ఉండదు. తగుదునమ్మా అని కనిపించిన వారినంతా కుడుతూ పోతుంటే ఎవరు ఊరుకుంటారు? తిందామని పెట్టుకున్న ఆహారాన్ని అల్లుకు పోతుంటే మానవులు మాత్రం ఎలా ఊరుకుంటారు? చేసేదంతా చేసి ఇపుడు పోరాటం ఒకటి సమయం దండగ" అంది ఆవేశంగా చిలుక..

ఆ మాటలకి తలదించుకున్న చీమల్ని నిమురుతూ నెమలి "ఊరుకోండి చీమల్లారా! మనం తక్కువ అనుకుంటేనే గదా తక్కువ? అసలు మీకు మీరే మీరు తక్కువ, అల్పమైనవారం. శక్తి లేనివారం. ఎవరో మనల్ని చంపేస్తారు. అని బాధపడుతుంటే ఇక మిమ్మల్ని ఎవరు కాపాడుతారు? ఎవరికైనా తమపై తమకు నమ్మకం ఉండాలి. తమని తాము కాపాడుకోగలం అనే ధైర్యం ఉండాలి. రూపం అనేది ఆ భగవంతుని సృష్టి. కానీ కర్తవ్యం మాత్రం అందరికీ సమానంగానే ఉంటుంది. చిన్న ప్రాణులని తక్కువ, పెద్ద ప్రాణులని ఎక్కువ ఎక్కడా ఉండదు. అర్థమైందా? చలి చీమల చేతికి చిక్కిన కొండచిలువ చనిపోలేదా? మానవులు సైతం మిమ్మల్ని చూడగానే పారిపోతారు. ఒక్కసారి మీరు కుడితే విలవిల లాడిపోతారు. ఏ జీవికైనా జనన మరణాలు సహజం. ఏమంటారు? రాబోతున్న మరణాన్ని తలుచుకుంటూ ఉన్న జీవితాన్ని అశాంతి మయం చేసుకోకండి'' అంటూ నెమ్మదిగా ముందుకు కదిలింది నెమలి.



-శైలజామిత్ర
9290900879

# ఏది శాశ్వతం?

ఈ జీవితం శాశ్వతమా
ఈ ప్రాణం శాశ్వతమా
అశాశ్వతమైన ఈ జీవితంలో
నీ ప్రాణానికి ఏమైనా
భద్రత ఉందా?
లేదా, ఎల్లకాలం బతుకుతావన్న
నమ్మకం నీకేమైనా ఉందా?

ఆశాశ్వతమైన ప్రాణం
అంతులేని జీవన గమనం
కానీ నిరంతరం ఒకరిపై
ఒకరికి ఈర్ష్య ద్వేషాలు.

స్నేహితులతో శత్రుత్వం
బంధువులతో వైరం
నా కులం గొప్పదని
నా మతం ఉన్నతమని
విర్ర వీగే తత్వం.

ఎంత సంపాదించామూ
అన్నది కాదు గొప్పతనం
ఎంత గొప్పగా బతికామూ
అన్నదే ప్రధానం.

బతికినంత కాలం
పదవి,హోదా,సంపాదన
కాదు శాశ్వతం...!
చచ్చిన కూడా సంపాదించుకున్న
పేరు,కీర్తి మాత్రమే శాశ్వతం..!!

శాశ్వతం కానీ వస్తువులు,
ప్రాణాలపై
ఆశలు పెంచుకోకు!
శాశ్వతమైన పేరు వచ్చేలా
జీవితం కొనసాగించు!
అందరి హృదయాలలో శాశ్వతంగా
ఉండేలా చిరు స్థానం సంపాదించు!!



-ఎన్.. రాజేష్
9849335757

# నోటుస్వామ్య వికారాలు

ప్రజాస్వామ్యం పలుచబడిపోయి..
నోటుస్వామ్యం చిక్కబడుతోంది !
ఓటుస్వామ్యం రెచ్చిపోయి..
మద్యం మత్తులో ఓటు తూగుతోంది !
డెమక్రసీ డెత్‌బెడ్‌పై చేరిగా..
క్యాషోక్రసీ నాట్యమాడుతోంది !
ఎన్నికల ఇకమతుల విచిత్ర వికారాలు..
ప్రజాస్వామ్యమే పరిహాసమైన రీతులు !

ఎన్నిక నియమాలు ఉత్తమాటలై..
వాగ్దానాల వరాలు కురుస్తున్నాయి !
పోలీసు కవాతులు కళ్లు మూసి..
నోట్ల కట్టలు పట్టపగలే పారుతున్నాయి !

ఓటరు 'మనీగోడు'లో మునిగి..
ముక్క చుక్కలో మునుగుతున్నాడు !
మునుగోడు ఓటరు మహాశయుడినే..
పిలిచి పిలిచి మర్యాదల గమ్మత్తులు !


తరిగిన ఓటరు విలువల నిధులు..
చెలరేగిన అనంత అవినీతి చేష్టలు !
ఎవరు గెలిచి ఎవరు ఓడినా..
పరాభవమైంది ప్రజాస్వామ్యమే కదా !
నోటుస్వామ్యాన్ని నిర్దయగా బొందబెట్టి..
ప్రజాస్వామ్యానికే కట్టాలి నికార్సు పట్టం !



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

పుస్తక సమీక్ష

# వర్తమాన సామాజిక దర్పణం "కైరవ శతకం" !




"తాత మాటలు కైరవా ! తరగని నిధి" మకుటంతో

మనవడిని సంబోధిస్తూ వెరసి సమాజాన్నీ ఉద్దేశిస్తూ

రచించిన వేణుశ్రీ గారి శతక మిది. శతకం రాసిన కవిశత విధాలా వ్యవస్థ మారాలని నూరు నూరు కవితల

తమ జీవితానుభవాన్ని రంగ రించి రాత్రి పగలని ఎరుగక **జాగరణగా రాసారు.**

**"కోరిన నాయకులను కొత్త దేవుళ్ళుగా"** నేటినాయకులే ప్రజలకు దేవుల్లు అవుతున్నారని -- పథకాలే వరాలుగా ప్రజలను ఆకర్షిస్తారని పాలాభిషేకాలూ దేవుడికి జరిగినట్లే జరుగుతాయనీ కవి వర్తమాన దుస్థితికి ఈ పద్యంలోవాపోయారు.

**"బట్ట తలలున్నచో భాగ్యవం తులనియు... దువ్వెనవసరము లేదు"** ఈ పద్యంలో బట్టతలగల వారి బాధను నామోషితనానికి ఊరటనిచ్చి-- వారికి తల నూనె అవసరం రాదని దువ్వెన చేత ధరించ అవసరమే రాదని-ఇక తలకు రంగు తంటానే ఉండదని కవి చమత్కరించారు.!

కుల వృత్తులు నడవక ఏలా బాధమయులౌతున్నారో ఈ పద్యంలో **"చేనేత వస్త్రాలు చేతనేయుట లేదు మిల్లులు వచ్చియు మింటకెగిసే"** ఆధునిక విజ్ఞానం అభివృద్ధి చెందాకా చేతితో చేసే గొంగడి గానుగ నూనె కంచరి మొదలైన పొట్ట కూటి పరంపర కుల వృత్తులు మూలపడ్డాయని-- కొత్త కొలు వుల నియామకం లేక ఎండమావు లేనని ఆకలి ఏలిక అయిందని వ్యవస్థ అవస్థ ఈ పద్య సేద్యంలో ఆర్ద్రమైంది.

"సిన్ననాడాడిన సిర్రగోనాటలు... చిన్న నాటి గుర్తులునింక చెరగకుండే" ! ఈ పద్యంలో ఆనాటి మన బాల్యంలోని ఆటలు - రేగ్గాయ లు చింతకాయలు కోనేటి యీతలు ఒట్టు పెట్టుకునే ఈ సరదాలన్నీ ఈనాటి తరాల మధ్య లేవని ఆ స్మృతులను మనకందించారు. ఆ కాలం నాటి బాల్యానందం బహుదూరం అయిందని కవిగారి మన కలవరింత.

**"తాగకు తాగుతే తూగకు తూగుతే ఊగకు"** అంటూ ఈ పద్యం చమత్కారంగా సాగింది. మద్యం తాగితే ఇంటికి ఏ రకంగా చేరుతాడో- ఇల్లాలు ఏ విధాంగా వేగిస్తుందో-- దృశ్యమానం చేసారు. మన చుట్టు పక్కల ఇలాంటి పెద్ద మనుషులెందరో!

**"మందమతికిపలు మార్లు చెప్పిన గాని తిరిగి అడిగినచో తికమక పడు"** ఈ పద్యం విద్యార్థుల మానసిక స్థితి గురించి మనకు తేటతెల్లం.

అందరూ ఏకసంథాగ్రాహు లుండరని -అట్టి వారు వృత్తి విద్యలలో రాణించగలని మార్గదర్శకంగా ఈ పద్యం దిక్సూ చియే.


**" మా తెలంగాణ మాగాణ మట్టి బిడ్డ సింగిరెడ్డింటి బిడ్డడు నింగికెగసె"** మహా కవి జ్ఞాన పీఠ్ అవార్డు గ్రహీత మన సి నారాయణ రెడ్డి గారి

అస్తమించిన వేళ కవి గారు వారిని స్మరిస్తూ రచించిన పద్యంతో అంజలి ఘటిస్తారు. సినారె విశ్వంభర

చిత్రసీమల వారి అపురూప పాండిత్యం ఉస్మానియా యూనివ ర్సిటీలో వారి ఆచార్యత్వం ఈ పద్యంలో పలవరింతగా సాగింది. కవిగారికి వారి పై గల ఆరాధన భావం ఈ పద్య సంస్పందన.

వేణుశ్రీ గారి ఈ కైరవ శతకం 121 పద్యాలతో అనేకానేక సంఘటనల అనుభవాల దేశకాలాల కవి సమయాల జీవధార. వర్తమాన భూత భవిష్యత్తుకూ కాలదర్శిని.

**ప్రతులకు:**
వేణుశ్రీ
చరవాణి: 8328067855



- కందాళై రాఘవాచార్య
8790593638

# ఒక అమ్మ కథ

అనగనగా ఒక ఊరిలో సీత అనే అమ్మాయి ఉండేది. ఆ అమ్మాయి పేద అమ్మాయి వాళ్ళ అమ్మ రోజు కూలి పనులకు వెళ్లి అమ్మాయిని చదివించేది. ఒకరోజు లాగానే సీత బడికి వెళ్ళింది వాళ్ళ అమ్మ కూలి పనులకు వెళ్ళిది. సీత వాళ్ళ అమ్మ రోజు లాగానే కూలి పనులకు వెళ్లి వస్తుంటే దారిలో ప్రమాదం జరిగింది. సీతకు వాళ్ళ అమ్మకు ప్రమాదం జరిగిన విషయం తెలియగానే పరిగెత్తుకుంటూ ఆసుపత్రికి వచ్చింది వాళ్ళ అమ్మను చూసి అమ్మ ఏమైంది అని అడిగింది. వాళ్ళ అమ్మ నాకు ఏమీ గుర్తు లేదని చెప్పింది. అయితే అమ్మ నీ ఆరోగ్యం నయమయ్యే వరకు నేను కూలి పనులకు వెళ్ళవచ్చా అని అడిగింది అప్పుడు వాళ్ళ అమ్మ వద్దు సీత నువ్వు బడికి వెళ్లి చదువుకో అని చెప్పింది. అయితే అమ్మ నేను చదువుకుంటాను కానీ మన ఇల్లు గడవడానికి పైసలు ఎట్లా అన్నప్పుడు వాళ్ళ అమ్మ సీతతో నువ్వు మంచిగా చదువుకొని నా పేరు నిలబెట్టాలి ఇదే నా కోరిక నేను ఎలాగోలా కష్టపడి ఇల్లు గడుపుతాను అన్నది.

చూశారు కదా ఒక కన్న బిడ్డ కోసం తల్లి పడే తపన అందుకే అమ్మను మించిన దైవం లేదు అన్నారు పెద్దవాళ్లు. అమ్మ మాటలతో ఆ సీత బాగా చదువుకొని ఉన్నత ఉద్యోగం సంపాదించి వాళ్ళ అమ్మను సంతోషపరిచింది.



-టి నవ్య,
8వ తరగతి,
ప్రాథమికోన్నత పాఠశాల
కొండాపూర్ బి,
చేగుంట మండలం, మెదక్ జిల్లా

# పీఠం

తోలు బొమ్మలాట
ఎన్నికల చోట
బడుగుల బలహీనతలు
నేతల బలం బలగం

ఆడించే దంతా డబ్బు
ఆడెమాటల్లో తుప్పు
అదంతా వారికే ఒప్పు
తెలిసి ఊరుకోవడం తప్పు

బడుగుల బలం తెలుసుకో
కలిసి మెలిసి మసలుకో
అడుగు లన్ని అధికార పీఠం వైపు
తడబడకుండా సాగాలి ఆవైపు



-రేడియమ్
9291527757

